కథా నిలయం
3615

# మహాపర్వతం – మరుగుజ్జు

''ఇవ్వాళ కాలేజీ లేదా?''

ప్రమీల మాటవిని వెనక్కి తిరిగాడు రామం. చలికాలపు ఎండకు నిలబడి టూత్‌బ్రష్‌తో ముఖం కడుక్కుంటున్నాడు. ప్రమీల వాళ్ళ వాటావైపు నీళ్ళు చల్లి ముగ్గు వేస్తోంది.

''మొద్దబ్బాయి. ఏడింటిదాకా నిద్దరేనా, మార్చి దగ్గిర పడుతూంటే...'' నవ్వుతోంది ప్రమీల.

ప్రమీల ముగ్గువేయటం అయిపోతోంది. ఆమె పని అయిపోయేలోగా ఏమయినా చెప్పాలనుకుంటున్నాడు రామం.

''మధ్యాహ్నం వస్తావా! గార్డెన్స్‌కి వెళ్దాం....''

''హుష్!.... అన్నయ్య!...''

తొందర తొందరగా పని పూర్తిచేసుకున్నట్టు చీపురూ, నీళ్లబక్కెట్టూ, ముగ్గుబుట్టా తీసుకుని ఇంట్లోకి వెళ్లిపోయింది ప్రమీల.

ప్రమీల అన్నయ్య ప్రసాద్ అప్పుడే లేచాడుకాబోలు చలికి ఒళ్లంతా ముడుచుకుని ఎండలో కూలబడ్డాడు.

''గు..గు... గుడ్‌మార్నింగ్, రామంగారూ! పొద్దున్నే లేచారే....''

పానకంలో పుడకలా వచ్చిన ప్రసాద్‌ను చూస్తే ఒళ్లు మండిపోయింది రామానికి.

''మీ చెల్లాయి ఆలస్యంగా లేచానంటూంది'' అనబోయి ''గు.... గు... గుడ్‌మార్నింగ్'' అని నోట్లోని నురుగును తుపుక్కున ఊసి ఇంట్లోకి వెళ్లిపోయాడు రామం. అప్పటికీ కోపం చల్లారనట్లుంది, వెళ్లి చల్లటినీళ్లతో ముఖం కడుక్కున్నాడు.

ప్రమీలా వాళ్ల నాన్నకు హైదరాబాదు ట్రాన్స్‌ఫరయింది. రామం ఇంట్లో ఒక భాగం అద్దెకు తీసుకుని కాపురం పెట్టిన రెండు నెలలకు మొదలయింది ప్రమీలా రామాయణం.

రామం బుద్ధిమంతుడు. అలా అని ఆ చుట్టుపక్కల పేరు. ఓ అమ్మాయి జోలికి పోక, బుద్ధిగా తల వంచుకుపోయి, బుద్ధిగా తిరిగివస్తాడని వాళ్ల అమ్మ నమ్మకం. అలాంటి

బుద్ధిమంతుడిని ప్రమీల వచ్చి చెరిచేసింది. అయినా అందులో అతని ప్రమేయం ఏమీ లేదు. పెరట్లో జామకాయలు కోస్తూ, కొమ్మ విరిగి కింద పడితే, మొదట గలగలా నవ్వింది ప్రమీలే. కోపంకంటే ఓ ఆడపిల్ల ముందు అలా పడటం అవమానం అనిపించింది. పైజామా, చొక్కా దులుపుకుని ఇంట్లోకి ఉడాయించడం తప్ప ఏం చేయలేకపోయాడు.

ఆ తరువాత ప్రమీల చాలాసార్లు నవ్వింది. మొదటిసారి అంత పెద్దగా కాదు. అతన్ని చూసి ముసిముసి నవ్వులు నవ్వింది. ఆమె అలా నవ్వినప్పుడల్లా చాలా సంతోషంగా ఉండేది రామానికి కాని ఏం చేయాలో తోచక అలాగే చూస్తూ ఉండిపోయేవాడు.

ఓనాడు సాయంత్రం వీధి వరండాలో ఎండకు ఆరేసిన గుడ్డలు విప్పుతూంటే ధైర్యం చేసి మెల్లగా అడిగాడు.

''ఏం పేరు?''

''ప్రమీల....''

తరవాతేం మాట్లాడాలో తోచలేదు.

''ప్చ్.'' నవ్వుతోంది ప్రమీల.

''ఏమిటి?''

''అయిపోయినయ్యా మాటలు?... యూనివర్సిటీ కాలేజీలో పి.యు.సి. చదువుతున్నాను. మూడో నంబరు బస్సుల్లో ఎప్పుడయినా మీ కగుపడితే, అగుపడవచ్చు. మా నాన్న రైల్వే ఇంజనీరు ఆఫీసులో సెక్షన్ హెడ్‌గా ఉంటున్నారు. అంతకుముందు జబల్‌పూర్‌లో ఉండేవాళ్లం... మే మిక్కడకు రాకముందే మా అన్నయ్య ఇక్కడ సేఠ్ చమన్‌లాల్ అండ్ సన్స్ కంట్రాక్టర్స్ దగ్గిర ఉద్యోగం.... అంతకుముందు హోటలు భోజనం, మఠం నిద్ర. మేం వచ్చిన తరువాత మాతో ఉంటున్నాడు. ఇది మా సమగ్ర సాహిత్యం....''

నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడిపోయాడు రామం.

''ఆఁ... వస్తున్నానమ్మా!... వీధిలోకి వెళ్లినట్టున్నాడు, రాజుని పిలుచుకువస్తా...''

వాళ్లమ్మ పిలుస్తూన్నట్టుంది, ప్రమీల వెళ్లిపోయింది.

మొదట్లో రామానికి భయం వేసేది ఆమెని చూస్తే. ఆడపిల్ల ఇలా కాదు ఉండవలసింది అనుకునేవాడు. కొన్ని సార్లు 'ఏమిటి వెకిలివేషం' అనుకునేవాడు. తను బుద్ధిమంతుడు కాబట్టి సరిపోయింది, మరే పోకిరీ వెధవయినా అయితే ఇంకేముంది?

రామానికి సాహిత్యం అంటే ఇష్టం. అందులో శరత్ సాహిత్యమంటే మరీ ఇష్టం. శరత్ 'శ్రీకాంత్' ఎన్నోసార్లు చదివాడు. శ్రీకాంత్‌లా తానూ వివాహబంధం లేకుండా ఓ రాజ్యలక్ష్మికి

ఆరాధ్యదైవం అవాలని కోరుకునేవాడు. శరత్ దేవదాసులా, భగ్న ప్రేమికుడిలా తానూ ఓ రోజు తాగి స్పృహ లేకుండా పడిపోవాలని కలలు కనేవాడు.

అతనికి ఎన్నెన్నో ఆదర్శాలుండేవి. ఈ ఆదర్శాలు పెళ్లిచేసుకుంటే ఆచరణలో పెట్టటం కష్టం అని అతని ఉద్దేశం. భగ్నప్రేమికుడవాలంటే ఓ చిన్న ప్రణయానుభవం అవసరం. కాని ఓ ఆడపిల్లని పలకరించటమంటేనే అతనికి భయం. ఎలా?

అలాంటి ఉద్దేశంతోనే రామం ప్రమీలకు మెల్ల మెల్లగా సమాధానం ఇవ్వటం ప్రారంభించాడు. కాని అది అంతటితో ఆగలేదు. యౌవనఝరిలో తెలివి తప్పినట్టు కొట్టుకుపోయాడు. 'ఆమెను చూడాలి, ఆమె నవ్వులో వంశీమోహనరవళి వినాలి' అనే ఆకాంక్ష ఇంకా ముందుకు ముందుకు తీసుకువెళ్లింది. ఆమెనే కోరసాగింది. ఆమెను తన కౌగిలిలో బంధించి, సుఖించాలనే ఆతృత, ఆవేశం ఎక్కువయ్యాయి.

ఓసారి అదే ప్రయత్నంలో చొరవచేశాడు. వాళ్లమ్మ మధ్యాహ్నం పక్కింటికి పేత్తనానికి వెళ్లింది. ఆరోజు ప్రమీల కాలేజీకెళ్లలేదంచేతో... తానూ మానేశాడు.

మధ్యగదిలో ఒక్కర్తే పేపరు చూస్తూ పడుకుంది ప్రమీల. రామానికి చాలా ఆత్రంగా ఉంది, వెళ్లి ఓ ముద్దు అయినా పెట్టుకోవాలని. ఆనాటి కానాటికి ఆమె చూపులు ఆహ్వానాల్లాగున్నాయి. ఒకవేపు భయం, ఎవరయినా చూస్తారేమోనని. తీరా వెళితే ఆమె ఏమంటుందోననే శంక.

కోరిక ఈడ్చింది. ఒంటరిగా ఉన్న ఆమె దగ్గరగా వెళ్లాడు. పిలవటానికీ, ఆమెని తాకటానికీ ఏదో భయం.

''ప్రమీలా...''

''ఎవరు? మీరా?... ఎందుకొచ్చారు? గెటౌట్... కొంచెం చనువిస్తే చాలు మీద కెక్కుతారు.. అమ్మో, ఎవరయినా చూస్తే ఇంకేమయినా ఉందా?'' ప్రమీల కాళిలా లేచింది.

రామం తడబడ్డాడు. ఆమెను చూస్తే అతనికి భయం వేసింది. పెద్దగా అంటున్న ఈ మాటలు ఎవరయినా వింటారేమోనని ఓ చెంప భయం... రెండడుగులు వెనక్కివేశాడు.

అతని వాలకం చూసి ప్రమీల పెద్దగా నవ్వింది.

''రా, పిరికీ! చిట్టీ! కూర్చో!'' చెయ్యి పట్టుకుతీసుకువెళ్లి పడకకుర్చీలో కూలేసింది. కుర్చీపట్టెమీదుగా అతనికి ఆనుతూ కూర్చుని, నుదుటిపై ముద్దుపెట్టుకుంది.

''నే కావాలా....?'' గోముగా, ముద్దుగా అతని కళ్లలోకి చూస్తూ అడిగింది.

రామం తల ఆడించాడు.

''రాత్రి పది గంటలకి వచ్చేయి. అమ్మ, నాన్న, అన్నయ్య, పిల్లలు మానాన్న స్నేహితుడి

కూతురు పెళ్లికి వెళతారు. నీకోసం నేనొక్కత్తిని ఇంట్లో ఉంటా, ఒంట్లో బావుండలేదని వంకపెట్టి... ఏం! పిచ్చీ! వస్తావుకదూ....''

రామానికి కొంచెం ధైర్యం వచ్చినట్లయింది. బహుశః ధైర్యం కాదేమో కోరిక అయి ఉండొచ్చు.

''సరే'' అన్నాడు ఆమె నడుంచుట్టూ చేతులువేసి దగ్గిరికి లాక్కుంటూ...

''ఊఁ ఇప్పుడేనా... రాత్రికి... ఏం?... అమ్మొస్తే బావుండదు... అదుగో... అమ్మ.... లే లే...''

రామం ఉలిక్కిపడి లేచి పరిగెత్తినట్టుగా నడిచాడు.

వెనగ్గా పెద్దగా నవ్వుతూ, చప్పట్లు కొడుతూ గెంతుతోంది ప్రమీల.

''షేమ్... షేమ్... షేమ్''.

రామం వెనక్కి తిరిగి చూశాడు. నాలిక బయటకుపెట్టి వెక్కిరిస్తోంది. ఎవరూ రావటంలేదు. అంతా తన నాడించటానికి కాబోలు. ఈ గోలంతా ఎవరయినా వింటారేమోనని భయం వేసింది రామానికి. అదృష్టవశాత్తూ వాళ్లమ్మ మధ్యాహ్నపు కునుకుతీస్తోంది.

రాత్రి ఎప్పుడవుతుందా, ప్రమీల ఎప్పుడు తన చేతుల్లో ఉంటుందా అని ఎదురుచూశాడు రామం. సాయంత్రం మామూలుగా క్రికెట్ ప్రాక్టీసుకి వెళ్లినా అతనికక్కడ ఎక్కువసేపు ఉండబుద్ధికాలేదు. మనసంతా ప్రమీలమీదే ఉంది. ఏమిటో ఆ పిల్ల వాలకం తనకర్థం కావటంలేదు. ఓ క్షణం ప్రమీల ప్రసన్నరాణి, మరుక్షణం చండీరాణి.

ఆ రోజు చాలా ఆలస్యంగా రాత్రి అయింది. శారదరాత్రి. వినీలాకాశంలో చుక్కలు మెరుస్తున్నాయి.

రామం మనస్సుచాలా ఉల్లాసంగా ఉంది. పెద్ద క్రికెట్‌మాచ్ గెలుపొందినంత ఆనందంగా ఉంది. తొమ్మిదిగంటలదాకా బజార్లలో తిరిగివచ్చి భోజనం పూర్తిచేసుకుని గుడ్డలు వేసుకుని బయల్దేరాడు.

''అమ్మా! నేను సాంబువాళ్ల ఇంటికి వెళుతున్నాను.''

సాంబు, రామం క్లాస్‌మేట్సు. ఇద్దరూ కలిసి చదువుకుంటూ ఉండేవాళ్లు.

రామం తల్లి వంటింట్లో పనిచేసుకుంటోంది. తండ్రి ఇంకా ఇంటికి రాలేదు.

రామం ప్రమీలవాళ్ల భాగపు వరండాలోకి వచ్చి నిలబడ్డాడు. వెన్నెల్లో వరండానీడ దూరందాకా పాకింది. వీధి వాకిలి తలుపు వేసి ఉంది. వెళ్లి తలుపు తడుతూ ''ప్రమీలా'' అని మెల్లిగా పిలిచాడు.

ప్రమీల తలుపు తెరిచింది.

''వచ్చారా మీరు... ఉండండి ఓక్షణం...''

మళ్లీ తలుపువేసింది. ఎప్పుడు తలుపుతెరుస్తుందోనని రామం తలుపు దగ్గిరగా నుంచున్నాడు. ఐదు నిమిషాలయింది. ప్రమీల తలుపు తెరవలేదు. రామానికి భయంగా వుంది, ఎవరయినా తన్ను చూస్తారేమోనని మరో అయిదునిమిషాలు ఎదురుచూసి మళ్లీ తలుపుతట్టాడు. సమాధానం రాలేదు. రామానికి ఏం చేయాలో తోచలేదు. ఒకపక్క ప్రమీలమీద కోపం వస్తోంది. తనని ఫూల్‌ని చేయటానికి ఈనాటకమాడిందేమోనన్న అనుమానం వెన్నులో పొడుస్తూన్నట్లయింది. అటు తిరిగి వెళ్లటానికి మనస్కొప్పటంలేదు.

ఏం పనిమీద వచ్చిందో వీధి వాకిటి దగ్గిరికి వచ్చిన రామంతల్లి, ''నీకేం పనిరా! అక్కడెందుకు తారట్లాడుతున్నావు?'' అని ఏదో అనుమానంగా తీక్ష్ణంగా చూస్తూ అడిగింది.

రామానికి ముచ్చెమటలుపోశాయి.

''ఏం లేదమ్మా! మరే... మరే...'' నసుగుతున్నాడు రామం, ఏం చెప్పాలో తోచక.

అంతలో తలుపు తెరుచుకొంది. ప్రమీల బయటికి వచ్చింది.

''అయ్యో! మీరా తలుపు తట్టింది? నేను అన్నం తింటున్నాను. పెళ్లిసంగతి మరిచిపోయి, అన్నయ్య పొద్దున మీతో సెకండ్ షోకి వస్తానని చెప్పాడట. పెళ్లికి వెళ్లకపోతే బావుండదు. మిమ్మల్ని డిజప్పాయింట్ చేసినందుకు సారీ చెప్పమన్నాడు.''

తన అవకతవక పనికి ప్రమీల తడిక అల్లేస్తూంది.

''అత్తయ్యగారూ! ఒంట్లో ఏం బావుండలేదు. నాకు ఒక్కదానికే ఉండటానికి భయం వేస్తోంది. అమ్మవాళ్లు వచ్చిందాక మీరూ ఇక్కడే పడుకుందురుగాని రండి.''

''అయ్యో! అలాగటే, తల్లీ... ఏదీ, ఇలా రా... ఒళ్లు చూస్తాను.... చల్లగానే ఉందే... లోపలకాక జేరిందేమో... ఏం చదువో, నాతల్లీ... చదివి చదివి రోగం తెచ్చుకుంటున్నావు. ఇవాళ్టికి చదవకుండా పడుకో... మీ మామయ్యగారు రాగానే ఆయనకు భోజనం పెట్టి వస్తాను. అందాకా నా దగ్గిరే ఉందువుగానిరా...''

ఈ నాటకమంతా చూస్తున్న రామానికి కాస్త ఊపిరి సలిపినట్లయింది.

''ప్రసాదూ, సాంబూ, నేను సెకండ్ షోకి వెళదామనుకున్నామమ్మా. ఉంటానని చెప్పి భలేపని చేశాడే ఈయన'' అన్నాడు రామం.

''ఏం సెకండ్‌షోలురా... ఆరోగ్యం పాడుచేసుకోవటానికి... వెళ్లి చదువుకో... రేపు మొదటాటకి వెళుదురుగానిలే...'' రామం తల్లి మందలించింది.

ఒక్క క్షణం ఊపిరి పీల్చుకుని బయటపడ్డాడు రామం.

ప్రమీలమీద పూర్తిగా కోపం వచ్చింది. తనను మరీ అలుసు చేసేస్తోందనుకున్నాడు. ఇంక ప్రమీల వంక చూడకూడదు, మాట్లాడకూడదు అనుకున్నాడు.

చదువుకోబుద్ధికాలేదు. అనుకోకుండానే ప్రమీల సెకండ్ షో ప్రోగ్రామ్ ఫిక్స్ చేసింది. రామం, సాంబు బయలుదేరారు లతా థియేటర్‌కు.

రామానికి కసిగా ఉంది. మనస్సు శాంతిపరుచుకోవటానికి సాంబుకి తనో హీరోలాగ కట్టుకథ చెప్పాడు దారిలో. ''మా పక్కింటి పిల్ల ఉంది చూశావు... ఆపిల్ల సంగతేరా! కామం కళ్లు కనబడనీయటం లేదు. నన్నెప్పుడు చూసినా నవ్వుతూ ఉంటుంది. ఆ పిల్ల తల్లిదండ్రులు ఆ అమ్మాయికి త్వరగా పెళ్లిచేస్తే మంచిది.... ఆ అమ్మాయి వాలకం అదీ చూస్తూంటే నేను కాబట్టి సరిపోయింది. మరెవరయినా అయితే ఈపాటికి నాశనం చేసేవాళ్లు...'' రామం చెప్పుకుపోతున్నాడు మిత్రుడికి.

''నీ మొహంలేరా! యౌవనం అందరికీ సహజమైంది. స్పోర్ట్స్‌మన్‌కి ఉండవలసిన స్పోర్టివ్‌నెస్ నీలో లేదురా. ఏ విషయం స్పోర్టివ్‌గా తీసుకోవేం. నేనొక మాటంటే నీ వేమనుకోవు గదా!... ఆ అమ్మాయంటే నీకూ కుతూహలముంది కదా! నువ్వెందుకు పెళ్లి చేసుకోవు.. ఆ అమ్మాయికిలాగే నీకూ చెడిపోయే అవకాశం లేదా....''

రామానికి సాంబు మాటలు రుచించలేదు. అయినా ఏం మాట్లాడలేదు. అతని మాటల్లోని నిజాన్ని ఒప్పుకోవటానికి అతని మనస్సు ఏమాత్రమూ ఇష్టపడలేదు. సాంబు మాటలు ఏదో ఎద్దేవా చేసినట్లు, తన ప్రవర్తనను, శీలాన్ని వెక్కిరిస్తూన్నట్లు బాధపడ్డాడు. అయినా ఏళ్లతరబడి పోషింపబడ్డ, 'రాముడు బుద్ధిమంతు'డనే అహం సాంబు మాటల్ని త్వరలో మరిచిపోయేట్టు చేసింది.

ఈ సంఘటన తరువాత రామానికి ప్రమీలంటే అసహ్యం వేసింది. కాదు, భయం అధికమయిందేమో! ఎలా అని ఎలా కొంప ముంచుతుందో, ఎవరు తన ప్రవర్తనలో తప్పుపడతారో అనే భయం, ఆమెవేపు చూడనిచ్చింది కాదు; ఆమెతో మాట్లాడనిచ్చిందికాదు. ప్రమీలకూడా ఏమనుకున్నదో ఏమో ఇవాల్టిదాకా అతన్ని కవ్వించలేదు.

ప్రమీల ఈ నాటి పలకరింపుతో అప్పటిదాకా కోరికల వక్రగహ్వరాన్ని కప్పిన భయపు మంచుతెర కరిగిపోయింది. భయపు మత్తును విదిలించుకున్నట్టు కాటువేయటానికి సిద్ధంగా పడగెత్తింది కోరికల తాచు. స్నానంచేసి చదువుకు కూర్చున్నాడు రామం. ప్రమీలతో ఎలా మాట్లాడాలో తోచటంలేదు. మనస్సు చదువులో లగ్నం కావటంలేదు. పుస్తకాలన్నీ తీసి పక్కన పెట్టాడు. ఓ క్షణం వీధివాకిలికి జారబడి నుంచున్నాడు, ప్రమీల కనిపిస్తుందేమోనని, 'ఊహూం పాడు పిల్ల... ఎప్పుడూ ఇంతే. దాని వెంట పడటం తనదే తప్పు' అనుకున్నాడోక్షణం. అయినా

మనస్సాగలేదు. గదిలో నాలుగయిదుసార్లు పచార్లు చేశాడు. ఓ క్షణం కళ్లు మూసుకుని కుర్చీలో పడుకున్నాడు.

ఇంతలో తల్లి పిలిచింది - ''తొమ్మిదవుతుంటే అన్నం తిని కాలేజీకెళ్లవు(ట్రా''అని. రామం భోజనం చేసి వచ్చాడు. గుడ్డలు వేసుకుని పుస్తకాలు సర్దుకున్నాడు. అయినా కాలేజీకి వెళ్లబుద్ధి కావటం లేదు.

ప్రమీలవాళ్ల వాటావేపు ఒకసారి వంగి చూశాడు. ప్రమీల జాడలేదు. ఆమె తమ్ముడు రాజు వరండాలో ఆడుకుంటున్నాడు. వాణ్ణి పిలిచి ఆమె సంగతి అడుగుదామనుకున్నాడు.

అంతలో .ప్రమీల ''యూనివర్సిటీకి వెళుతున్నానమ్మా'' అంటూ తల్లికి చెప్పి బయటపడింది. రామాన్ని చూసి వెక్కిరించుతూ తలఎత్తి సకిలించింది.

''ఒరే, రాజూ! ఐదింటికి కోఠీతాజ్ దగ్గిర కనిపించరా'' అంటూంది.

''ఏమిటే, అక్కా!'' అంటూ వచ్చాడు రాజు.

''ఏం లేదులే కాని నువ్వాడుకో, వచ్చేటప్పుడు కోఠీలో నీకు పతంగి మాంజ తెస్తాగా...''

''నిజం!... అక్కా! ఎర్రరంగు మాంజ, ఎర్ర రంగు పతంగి పట్టుకురా... ఎరుపు గాలిలో ఎగురుతూ ఉంటే ఎంచక్కా ఉంటుందని!''

''సరే... సరే, నే వెళతా... తప్పకుండారా'' అని రామంవైపో చూపు విసిరి, ఎదురుగా వస్తున్న క్లాస్‌మేట్ వసంతతో కలిసి వెళ్లిపోయింది.

రామానికి అర్థమయింది ప్రమీల సంకేతం. ఐదు గంటలకు కోఠీ తాజ్ దగ్గిర సమావేశం. ఓ మూల ఆమె వస్తుందో, రాదోనన్న అనుమానపిశాచం వెంటపడుతున్నా, దాని గొంతు ఓ క్షణం నొక్కిపట్టి సంతోషపడ్డాడు రామం.

ఆ రోజు ఈవినింగ్ క్లాసులన్నీ ఎగ్గొట్టి, ఎప్పుడూ మానుకోని క్రికెట్ ప్రాక్టీసుకు స్వస్తిచెప్పి ట్రిమ్‌గా తయారయి అయిదుగంటలకంటే ముందుగానే తాజ్ దగ్గిరికి వచ్చాడు రామం. క్షణమో యుగమయితే పదిహేను యుగాల తరువాత అభిసారికలా వచ్చింది ప్రమీల. అప్పటిదాకా ముసిరిన కాలమేఘాలు విచ్చుకున్నాయి. ఎండాకాలపు వేడిలో పొడరు పులిమిన రామం ముఖం, సంతోషంతో మరింత నల్లగా ప్రకాశించింది. ప్రశాంతమైన పాచి పారుకుపోయిన కొలనులో రాయేస్తే తెల్లకలవలతోడి అలల సందడిలా నవ్వాడు.

ఇద్దరూ కలిసి తాజ్‌లో వెళ్లి కూర్చున్నారు. ఒళ్లూ, మనసూ చల్లబడేలా ఓ కూల్ డ్రింక్ తాగి బయటపడ్డారు.

ప్రమీల ఏం మాట్లాడలేదు.

రాముమే దారి తీశాడు.

''పబ్లిక్ గార్డెన్స్‌కి వెళదాం'' అన్నాడు రామం.

''మీ ఇష్టం'' అన్నది ప్రమీల కొంచెం సిగ్గుపడుతూ.

ఇవాల్టి ఆమె చహరా అతనికి నచ్చింది. స్త్రీ అంటే సిగ్గుల గువ్వలా ఉండాలి కాని, బరితెగించిన వాగుడుపిట్టలా కాదు. అందులో ఇవాళ తన ఇష్టానికి ఓ ప్రాముఖ్యం ఇచ్చింది. అంతకంటే మొగాడి అహానికి తృప్తేమిటి?

ఓ రిక్షాని పిలిచాడు రామం.

ఓ క్షణం తటపటాయించి కూర్చుంది ప్రమీల రిక్షాలో.

హైదరాబాదు గూడురిక్షాలో గువ్వలా ముడుచుకు కూర్చుంది ప్రమీల. అయినా రామం శరీరం స్వేచ్ఛగా ఆమెకు తగులుతూంది. ఇవ్వాళ తరతరాల మగవాడి అహం, ఆధిక్యం రామాన్ని అధిష్ఠించి, ఏమేమో ఊహింపజేస్తున్నాయి.

మనస్సులో ఉబలాటం, ఆమెను వెనగ్గా చెయ్యేసి దగ్గిరికి తీసుకోవాలని, కాని అంత చొరవ చెయ్యలేక పోయాడు. ఈ సంధిగ్ధంలో రిక్షా పబ్లిక్ గార్డెన్స్‌కి వచ్చింది. ఇద్దరూ లోపలికి పోయారు.

పలచపలచగా జనం. నిజాంషాహి జమానా పోయిన తరువాత ఆ గార్డెన్స్ ఆడంబరంకూడా తగ్గిపోయిందట.

అటూ ఇటూ తిరిగారు. అజంతా పెవిలియన్, హెల్త్‌మ్యూజియం ఎన్నోసార్లు చూసినవే. మళ్లీ వెళ్లాలనే ఆసక్తి కలగలేదు.

ఎండాకాలపు ఆ సాయంకాలం మనోహరంగా ఉంది. పచ్చపచ్చటి ప్రకృతి, చుట్టూతా రంగురంగుల జనసందోహం.

జనానికి దూరంగా ఓ పొద దగ్గిరగా పోయి కూర్చున్నారు.

రామానికి ఏం మాట్లాడాలో తోచలేదు. ఆమెను దగ్గిరికి తీసుకుని ముద్దు పెట్టుకోవాలనే కోరిక ఉద్ధృతమౌతోంది.

ప్రమీల చిన్నగా దగ్గి మొదలుపెట్టింది.

''నేనంటే మీకిష్టం కదూ!'' సన్నగా నవ్వుతూ అతని కళ్ళలోకి చూస్తూ అడిగింది.

'అవున'ని తల ఊపాడు రామం.

''ప్రేమా!''

''అవును, ప్రేమేకాబోలు, ప్రమీ! అనుభవంమీద కాని తెలీదు కాబోలు ఏదయినా.''

''ఏమిటి, చెప్పండి.''

''ప్రేమంటే ఏమిటి? యువతీయువకుల మధ్య సాన్నిహిత్యమెక్కువయితే ప్రేమ అంకురిస్తుంది. దాన్ని బహుశః ప్రేమే అంటారు కాబోలు. ఇవ్వాళ అనుభవంలో! వస్తోంది. ఏమంటావు?...''

''ఏమో, నాకేం తెలుసు... పెళ్ళి... పెళ్ళే.... నాకు తెలిసింది.'' ప్రమీల సిగ్గుపడిపోతూంది. ఆమె నునులేత బుగ్గల్లోని సిగ్గు రామాన్ని కవ్విస్తున్నట్లుంది.

''అవును, మనం పెళ్లి చేసుకుందాం... మన చదువులు పూర్తి అవాలి... అప్పుడారాణిని నా రాణిని చేసుకుంటా...'' ఆమెకు దగ్గిరగా జరుగుతూ అన్నాడు.

''మీ కోసం నేను వేచి ఉంటాను.. మీరేమనుకోరుకదూ!.. మీలోని సర్వోపాలతోను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. నన్ను వదులుకోరుగా... సమయం వచ్చేటప్పటికి మాటలు కుదరటంలేదు. నన్ను మీదాన్ని చేసుకునేవరకు వేచి ఉంటాను. చెప్పండి... చేతిలో చెయ్యేసి చెప్పండి.... నన్ను పెళ్లి చేసుకుంటారు కదూ!'' ఆర్ధ్రమయిన కంఠంతో, తల వంచుకుని సర్వసమర్పితయై చెప్పుకుపోతూంది. ఆమె కళ్లలో నీళ్లు నిలిచాయి.

అతడామె చెయ్యి తీసుకుని మెల్లిగా ఒత్తాడు. నవ్వాడు.

''భలేదానివిలే, ప్రమీ! నిన్నుకాక ఎవర్ని పెళ్ళిచేసుకుంటాను?''

అతడి ఆశ్వాసంతో ఆమెకు సాంత్వన లభించినట్లయింది. ఓ క్షణం గట్టిగా ఊపిరి పీల్చి, మిలమిలా మెరిసే కళ్లతో అతనివంక నునుసిగ్గుగా చూసింది.

అంతటి అల్లరిపిల్ల ఇంత బేల అవటం రామానికి ఆశ్చర్యంగా, ఆనందంగా, గర్వంగా ఉంది. ఓ మత్తగజాన్ని అదుపుకి తీసుకువచ్చిన మావటివాడిలా ఉంది అతడి మనసు.

చీకట్లు పలచ పలచగా ముసురుకుంటున్నాయి.

ప్రమీల లేచింది. రామానికి అప్పుడే వెళ్లిపోవటం ఏం ఇష్టంగా లేదు. అయినా లేచాడు. సందెచీకటి వెలుగులో గులాబిపొద వెనగ్గా ప్రమీలను పొదివి పట్టుకుని ఓ ముద్దు పెట్టుకున్నాడు. ప్రమీల మెల్లిగా వారిస్తూ పట్టు విదిలించుకుంది.

''ఊఁ... భలేవారే... పెళ్ళయిన తరవాతే ఇవన్నీ....''

''ఊఁ... అంతవరకు ఉపవాసమే.... మా ప్రమీ మంచిది. బంగారుమొలక. ఆమాత్రం దయచూపించదేం నామీద?....''

ప్రమీల కిలకిలా నవ్వింది. నాలిక బయటపెట్టి 'హుళక్కి' అంటూ వెక్కిరించింది. ఇదివరకులా ఆమె అంటే భయం వెయ్యలేదు రామానికి.

ఇద్దరూ బయల్దేరారు ఇంటికి. దోవలో రామం ప్రమీలకు పతంగి, మాంజ, కొని ఇచ్చాడు

★ ★ ★

అన్ని ప్రేమకథల్లోలానే ఈ కథలోకూడా చిన్న విఘ్నం ఏర్పడింది.

ప్రమీల వాళ్ల నాన్నగారికి విజయవాడ ట్రాన్స్‌ఫరయింది. ప్రమీల అన్న ప్రసాద్ మళ్లీ మఠంలోకి బస మార్చాడు. వాళ్లు ఇల్లు ఖాళీ చేశారు.

వాళ్లు వెళ్ళేలోగా ప్రమీలతో ఎలాగయినా మాట్లాడాలని, ఒక్కసారి ఆమెని తన కౌగిలిలో ఇరికించుకొని, ఆమెతోడి తన అనుభవాన్ని స్థిరపరుచుకోవాలని అనుకున్నాడు. కాని వీలులేకపోయింది. ఆమె అతనికి ఒంటరిగా లభించలేదు.

స్టేషన్‌కి వెళ్లటానికి తండ్రి తెచ్చిన టాక్సీలో ఎక్కుతూ, ముందుగది తలుపు కానుకొని నిలబడ్డ రామం కళ్లతో కళ్లు కలిపింది ప్రమీల. ఆర్ద్రమయిన నయనాలతో ఆమె చూచిన చూపు అతని హృదయాన్ని కదిలించినట్లయింది.

ఆరోజేం తోచలేదు రామానికి, వాళ్లు వెళ్లిపోయిన తరువాత.

ఆ తరవాత చాలా రోజుల వరకు ఆమె గుర్తుకు వచ్చినప్పుడల్లా, పబ్లిక్ గార్డెన్‌లో సిగ్గుపడుతున్న ఆనాటి ప్రమీలే అతని మనఃపథంలో గోచరించేది. ఈ కాస్త అనుభవం చాలు ఆలంబనంగా, తను ఊహించుకున్న నిర్మోహపుసన్యాసి జీవితం గడపటానికి. ఏదో పోగొట్టుకున్నవాడిలా ఉండే తనని చూసి, లోకం తనపై చూపించే జాలి, సానుభూతి- ఇవి చాలు జీవితమంతా నెట్టుకురావటానికి, ఒకవేళ ఆమెతోడి బంధం ఇంకా ముందుకుపోయి పెళ్లిదాకా వస్తే ఇంకేం ఉంది, తన జీవితంలో ప్రత్యేకత? అందరూ పెళ్లిచేసుకుంటునట్లే తనూ చేసుకునేవాడు, పిల్లల్ని కనేవాడు, ఉద్యోగం చేసేవాడు, డబ్బు చాలక ఇబ్బంది పడేవాడు. ఆ రంగులరమ్యహర్మ్యం, శరత్‌బాబు శ్రీకాంత్‌లాంటి బంధరహిత జీవితం ఓ పేకమేడై కూలిపోదూ?...

అంతా మన మంచికే వచ్చింది. ఆమె తండ్రి ఇక్కడ నుండి బదిలీ అవటం మంచిదయింది, తమ అనుబంధం మరింత పెరగకుండా ఉండటానికి.

కాని అలా అనుకున్న రామం మనస్సుతో సమాధానపడలేకపోయాడు. అప్పుడు ఆమె చూపించిన విశ్వాసం, ప్రేమలను అవహేళన చేయలేకపోయాడు.

కాని స్వార్థం, ఆడంబర వ్యామోహం అతని హృదయంలో ఏమూలో దాక్కున్న సౌహార్దాన్ని పూర్తిగా అణిచివేశాయి.

ప్రమీల విజయవాడ వెళ్లిన వారంరోజులకు రామానికి ఉత్తరం రాసింది.

''నా పిచ్చీ!

వెళ్లేముందు నీతో మాట్లాడాలనుకున్నాను. వీల్లేకపోయింది. అయినా నే చెప్పవలసిందంతా ఆనాడే చెప్పాను. ఎక్కడున్నా ఆమాటలు మరిచిపోలేరు మీరు. నాకు తెలుసు. జవాబు వ్రాయండి వెంటనే. కింద అడ్రసు ఇస్తున్నా....

మీ

- ప్రమీల''

రామం జవాబిద్దామనుకున్నాడు. కాని మనస్సులో స్వార్థపిశాచం లేచి కూర్చుంది. 'ఏమో ఎటు పోయి ఎటు వస్తుందో! రిటెన్‌గా కమిట్ కాకూడదు' అనుకున్నాడు. జవాబు వ్రాయలేదు.

కాలం గడిచింది. మరో నెల రోజులకు ప్రమీల దగ్గిరనుండి ఉత్తరం వచ్చింది.

''శ్రీ శ్రీ రామంగారికి,

మీ ఉత్తరం కోసం చాలా కాలంగా ఎదురుచూశాను. కాని రాలేదు. కారణం ఏమయి ఉంటుందో నాకంతుపట్టటం లేదు. జవాబు వ్రాయరూ? ఆరోజు మీరన్నమాట గుర్తు వస్తూంది. మన సాన్నిహిత్యంలో అంకురించిన మమత చంపుకోలేకుండా ఉన్నాను. ఎన్నో ఆలోచనలు వస్తున్నాయి. మళ్లీ కాలేజీలు తెరిచే రోజులు వస్తున్నాయి. బి.ఎ.లో చేరాలి. మీకు ఈ సంవత్సరంతో చదువు అయిపోతుంది కదా? మన పెళ్లివిషయం ఏం ఆలోచించారు? ఒక్కోసారి ఆలోచిస్తాను.... జయచంద్రుడంతటి దుర్మార్గుడుకాడు మా నాన్న.. అయినా పృథ్వీరాజులా వచ్చి, సర్వసమర్పణతో ఆహ్వానించే సంయుక్తలాంటి నన్ను లేవదీసుకుపొండి. వచ్చేస్తాను. మన జీవితంలో జయచంద్రుడు, రుక్మిలాంటి అడ్డంకులు లేవు. మరింకెందుకో.... ఏలినవారికీజాగు...

ఒట్లు వేసుకోవటం నాకసహ్యం. మీ దగ్గిరనుండి జవాబు రాకపోతే నాకేం బావుండదు....

మీ

ప్రమీల.''

రామం ప్రమీల ఉత్తరం అందుకుని తన కార్యనిర్వహణ కుశలతకు ఓ క్షణం గర్వపడ్డాడు. అంతటి పెంకిపిల్ల బేలగా తన్నర్థించటం చూసి ఓ క్షణం హిమాలయమంత ఎత్తుకు పెరిగినట్లూహించుకున్నాడు. కసిగా క్షణం ఆనందించాడు. ప్రమీల రాసిన ఉత్తరాలు జాగ్రత్తగా సూట్‌కేస్ అడుగుభాగంలో జాగ్రత్తచేశాడు.

అలా ఆమె చాలా ఉత్తరాలు రాసింది. ఒక్కదానికి అతని దగ్గిరనుండి ఆమెకు జవాబు వెళ్లలేదు.

కాలం దొర్లిపోతూంది. చాలాకాలంగా ప్రమీల దగ్గిరనుండి ఉత్తరాలు రావటంలేదు రామానికి. ఆ ఆటలోని ఆనందాన్ని పూర్తిగా అనుభవించిన తృప్తితో హాయినను భవించినా, ఏమూలో హృదయంలో కలుక్కుమంటూనే ఉంది.

ఇంజనీరుగా గోవాలో ఉద్యోగం దొరికింది. ఉద్యోగంలో చేరిన తరువాత ప్రపంచం తెలియటం మొదలెట్టింది. అమ్మా నాన్నల బలవంతంమీద ఓ చక్కటి చుక్క మెళ్లో పుస్తెకట్టాడు.... అయినా ప్రమీల రూపం అతడి మనస్సులో కోరికలు రేకెత్తిస్తూనే ఉండిపోయింది.

నాలుగు వసంతాలు గడిచిపోయాయి అతని పెళ్ళయి...

పెళ్ళాన్ని అత్తారింట్లో పురిటికి దించి, మళ్లీ బయల్దేరాడు రామం పాంజిమ్‌కు, ఎక్కువ రోజులు సెలవు లేకపోవటంవల్ల.

సికిందరాబాదులో ఎక్కిన బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ ఠంచన్‌గా ఏడూ ఇరవైకి గుంటకల్ ప్లాట్‌ఫారమ్ మీద దించింది. అక్కడ దిగి మైసూర్ నుండి వచ్చే హుబ్లి పాసింజరులో ఎక్కాడు.

సెకండ్‌క్లాస్‌పెట్టెలో ఎక్కువమంది జనం లేరు. పలచగా తెల్లగా ఉన్న స్త్రీ, రెండేళ్ళ కొడుకును కిటికీ దగ్గిరగా నిలబెట్టి పట్టుకు చూపిస్తోంది. ఆమెను చూడంగానే రామం ముఖం ఒక్కసారిగా వాలిపోయింది. తప్పించుకు తిరుగుతున్న దొంగకు కొత్వాల్ ఎదురు పడ్డట్లయింది. రామం నీరసపడిపోయాడు. ఎక్కాలా వద్దా అన్న సందిగ్ధంలో ఉండగానే ఆమె పిలిచింది.

''రండి.... రండి... రామారావుగారూ..... ఎన్నాళ్లికెన్నాళ్లికి తమ దర్శనం?''

రామం నీరసంగా వచ్చి కూర్చున్నాడు.

''అరెరె, ఏమిటలా ఉన్నారు...? నీరసంగా ఉన్నట్లుందే...? ఎందాకా ప్రయాణం... కొంచెం కాఫీ త్రాగండి...''

ఒకే ఇదిగా మాట్లాడేస్తూంది ప్రమీల. ఫ్లాస్కులో కాఫీ పోసి ఇచ్చింది. వద్దనుకుంటూనే తాగాడు రామం.

బండి నీరసంగా కదిలింది. కంపార్ట్‌మెంట్ పలచపలచగా ఉంది. ప్రమీలా, రామం ఓ మూలగా కూర్చున్నారు, వాళ్ల మాటలు ఎవరికీ వినిపించనంత దూరంగా.

''ఏం మారలేదు మీరు... అదే పిరికితనం... ఆలంబనం కోసం పరిగెత్తే మీ చహరా... శుద్ధ బుద్ధావతారం...'' నవ్వుతూ అంటోంది ప్రమీల. ఆమె నవ్వుల వరవడిలో క్షణం తేరుకున్నాడు రామం.

''ఎందాకా ప్రయాణం?''

''పాంజిమ్''

''అక్కడ ఉద్యోగమా ఇంజనీరుగారికి?''

''అవును.''

తేరుకున్న రామానికి ఆమె నడగాలనిపించిది - ఆమె ఎలా ఉందో, ఎక్కడికి వెళుతుందో ఏమిటో అని... అయినా సంకోచించాడు.

ఆమె నవ్వుతూంది... ''నా విషయం తెలుసుకోవాలనేగా నీకుతూహలం. అసమర్థుడికి ఆర్భాటమెక్కువట. నీ అంత పెద్ద ఆఫీసరు కాకపోయినా మా ఆయన రైల్వేలో ఓ పెద్ద ఉద్యోగమే చేస్తున్నాడు. మూడేళ్లయింది మా పెళ్లయి.. ఇదుగో వీడు మా పుత్రరత్నం. హాయిగా ఉంది జీవితం... అమ్మా, నాన్న, పిల్లలు బెజవాడలోనే ఉన్నారు. అన్నయ్యకీ పెళ్ళయింది. హుబ్లీలో ఆయన ఉద్యోగం. పుట్టింటికి వెళ్లివస్తున్నాను. ఇదీ మా సమగ్రసాహిత్యం...'' నవ్వుతోంది ప్రమీల. ఆమెలో ఏం మార్పులేదు. తనకు మొదటిసారి పరిచయమైనప్పుడు ఎలా మాట్లాడిందో, ఇప్పుడూ అలానే మాట్లాడుతోంది. కాకపోతే ఇప్పటి ఆమె మాటలు ఎద్దేవా చేస్తున్నట్లున్నాయి. ఇదివరకటి ఆమె హాస్యంలో హేళన, మమత, కోరిక, అమాయకత్వం ఉండేవి. ఇవాల్టి మాటల్లో అసహ్యం, ఎదుటి మనిషిని కించపరిచే భావం వున్నాయి. తన ఆధిక్యం స్ఫురించేటట్లు మాట్లాడుతూందామె.

విస్తుపోతూ, కోపగించుకుంటూ అలానే ఉండిపోయాడు రామం.

''నా ఉత్తరాలకు జవాబివ్వలేదేం?'' సూటిగా అడిగిందామె.

నిరుత్తరుడయిపోయాడు రామం.

''నాకు తెలుసు... నువ్వేం సమాధానమివ్వగలవు... అసలు నాదే పొరపాటయింది. పాత్రత ఎరిగి దానం చెయ్యమన్నారు. అపాత్ర దానం చెయ్యబోయాను. నాతో ఓ ఆటాడుకున్నావు. నీలాంటి అసమర్థుడికి నా హృదయంలో చోటివ్వటం నాదే తప్పు. నీ బలహీనతలన్నిటితో ప్రేమిస్తున్నానని బుద్ధి లేకుండా వాగానా నాడు.''

ఓ క్షణమాగి-

''అయినా నాకు మేలే జరిగింది. సమర్థుడైన మనిషి, హృదయమంతటితో స్వీకరించే సంపూర్ణ వ్యక్తిదొరికాడు నాకు. నువ్వు వట్టి పిరికివాడివి, చేతకానివాడివి... మంచివాడివి...'' అంది.

హృదయంలో దాచిపెట్టుకున్న కోపం మాటల్లో కరిగిపోతూంటే ఓ క్షణం శాంతపడింది ప్రమీల. నిర్వాక్కుగా కూర్చుండిపోయిన రామాన్ని, మహారాణి కాలి దగ్గిర బంటులా చూసి నవ్వింది.

రామం ఒళ్లు కుతకుతలాడిపోయింది. తనంటే నిర్లక్ష్యంగా, ఏమాత్రం గౌరవంగా మాట్లాడని వ్యక్తి దగ్గిర తను మర్యాదగా ఎందుకు ప్రవర్తించాలి. అయినా ఏమనాలో తోచలేదు. ముఖం గంటుపెట్టుకు కూర్చున్నాడు.

బండి వేగంగా పోతూంది. మొహం బయటకు పెడితే, కంట్లోపడ్డ బొగ్గునలుసు, ఎదురుగా కూర్చున్న ప్రమీలంతగా బాధపెట్టలేదు రామాన్ని.

''పెళ్లి అయిందా...'' ప్రశ్నించింది నవ్వుతూ ప్రమీల. ఆమె నవ్వులో హేళన ఉందో ఏముందో తనకర్థం కాలేదు.

రామానికి మాట్లాడాలనిపించలేదు. జవాబివ్వలేదు.

''కోపం వచ్చిందా? ఆటల్లో తగిలే దెబ్బలకెవరయినా ఏడుస్తారా? మనిద్దరం ఆడుకున్నాం... ఏదీ, ఎక్కడ తగిలింది దెబ్బ... మంత్రం పెట్టేదా...'' అంత కోపంలోకూడా రామానికి నవ్వు వచ్చింది, చిన్నపిల్లలా ఆమెచేసే చేష్టలకి.

''అవును. పెళ్ళయింది...''

''అయే ఉంటుంది... మీ నాన్న, అమ్మకుదిర్చిన సంబంధమేగా?'' రామం ఏం మాట్లాడలేదు.

''ఎన్ని వేలు తీసుకున్నావు?''

''పది.'' కసిగా అన్నాడు రామం.

''ఏం చవగ్గా అమ్ముడు పోయింది గిత్త! మార్కెట్ గిరాకీ బాగా ఉండి ఉండాలే...''

రామం కిటికీగుండా తలపెట్టి కదిలిపోయే చెట్లను, రాళ్ళురప్పలను చూస్తూ జవాబివ్వలేదు.

ఓ క్షణమాగి తనే మొదలెట్టింది ప్రమీల.

''పాపం, మీ ఆవిణ్ణి తలచుకుంటే జాలేస్తూంది నాకు. అన్ని వేలు తగలేసి ఓ పిరికిసింహాన్ని కొనుక్కుంది. ప్రపంచానికి సింహంలా కనిపిస్తుంది. ఆవిడకేం తెలుసు, హృదయంలో మేకని.''

అక్కడ కూర్చుని ఆమె మాటలు వినటం కష్టమనిపించింది. వెళ్లి తలుపు దగ్గిరగా నిలబడ్డాడు రామం. ఐదునిమిషాల తరవాత పిలిచింది ప్రమీల.

''కాస్త వీణ్ణి పట్టుక్కూర్చో... నేదొడ్లోకి వెళ్లిరావాలి.''

పిల్లవాణ్ణి అతడి చేతికిచ్చి ప్రమీల వెళ్ళింది. పిల్లవాడు తెల్లగా బొద్దుగా ఉన్నాడు. అంతా తల్లి పోలికే. పొదివి పట్టుకు కూర్చుని ప్రమీలను దగ్గిరికి తీసుకున్నట్టు ఫీలయ్యాడు. ప్రమీల శరీరంలో ఇదీ ఓ ఖండమేగా...

తెల్లగా బొమ్మలా నడిచి వస్తోంది ప్రమీల. పిశాచం మేలుకున్నట్లయింది రామానికి, ఆమె నేడ్పించాలనిపించింది.

కిటికీ పక్కగా వచ్చి కూర్చుంది ప్రమీల.

''అంత స్తిమితంగా వెళ్లావుకదా... నీమీది కోపంతో పిల్లవాణ్ణేమైనా చేస్తే ఏం చేసేదానివి?...'' పెద్దగా నవ్వింది ప్రమీల.

''నాకా భయం లేదు. నీ పిరికితనంమీద, నీ అసమర్ధతమీద నాకు గట్టి నమ్మకం.''

''అంటే...''

''అంటే.... నువ్వాపనిచేయలేవు. ఏ పని చేయాలన్నా దృఢమైన భావన, కోరిక, ఆత్మవిశ్వాసం ఉండాలి. చివరికి దొంగతనం చెయ్యాలన్నా కావాలి. మహారసికుడు కావాలన్నా, మహాత్ముడు కావాలన్నా, మర్డరర్ కావాలన్నా - ఆ కోరిక, కోపం, భావన దృఢంగా ఉండాలి. అవి లేనివాడు నీలా శుద్ధ బుద్ధావతారంలా, అసమర్ధుడుగా, పిరికివాడుగా, పనికిరానివాడుగా, వట్టి మంచివాడుగా ఉండిపోతాడు. వీణ్ణేమన్నా చేయాలంటే ఎన్ని కాన్సిక్వెన్సెస్ ఆలోచిస్తావు.... పోలీసులు... భవిష్యత్తు... హృదయంలో బాధ... అహఁహఁ... నువ్వు చెయ్యలేవు, నాకు తెలుసు...''

ఈ మాటలు వింటున్న రామం ఆత్మాభిమానం కట్టలు తెంచుకున్నట్లయింది. నిస్సహాయస్థితిలో ఎదురు తిరిగే మార్జాలంలా అయిపోయాడు. కోపంతో బుసలు కొడుతున్నట్లయిపోయాడు.

''కాదు... ఇవాళ తెలుపుతాను.... నీజీవితం నాశనం చేసి నా సమర్థతేమిటో నీకు తెలియచెబుతాను. ఇంకా నీకు గుర్తులేదేమో... నువ్వు రాసిన ఉత్తరాలు నాదగ్గిర సురక్షితంగా ఉన్నాయి... అవి మీ ఆయనకు చూపించి నీ జీవితం నిలువెల్లా కాల్చేస్తాను.... నేను తప్ప దిక్కులేకుండా చేస్తాను....''

ప్రమీల ఫక్కున నవ్వింది.

''ఊఁ కోపం వస్తూందే, పరవాలేదు... ఆ చేసేదేదో చెయ్యి.... నీ సమర్థతేమిటో చూస్తాను. ముందు బళ్లారి వస్తుంది కానీ భోజనాలు ఏర్పాటుచెయ్యి.... తరవాత తిండికి మాడాల్సి వస్తుంది.'' ఆమె అలా నవ్వేప్పటికి అతని కోపం నీరుకారినట్లయిపోయింది.

మెల్లగా బండి ప్లాట్‌ఫారమ్‌మీద ఆగింది. అప్పటిదాకా ఆడి ఆడి అలిసిపోయిన పిల్లవాడు తల్లి ఒడిలో పడుకుని నిద్రపోయాడు.

రామం దిగి వెళ్లి ప్రమీలకు భోజనం పంపి, తను అక్కడే తిని, వస్తూ బళ్లారి డయమండ్ వక్కపొడి పొట్లాలు తెచ్చాడు.

మళ్లీ భారంగా బండి కదిలింది.

కొంత జనం ఖాళీ అయినట్లయింది.

రామానికి అంత కోపం లేకపోయినా ప్రమీలతో మాట్లాడాలనిపించలేదు.

ఎదురు బెర్తుమీద కిటికీలోగుండా దూరంగా చూస్తూ కూర్చున్నాడు.

''రామం....'' పిలుస్తూంది ప్రమీల. ఆమె కంఠంలోని మృదుత్వానికి చలించి ఆమెవేపు చూశాడు రామం.

''నే నెలాగున్నాను?''

అర్థం కానట్లు చూశాడు, ఆమె వంక.

''అదే... అప్పుడు నా కౌగిలి కోసం పరితపించే వాడివి. అయినా నేనే దూరంగా ఉంచాను. ఇప్పుడంత అందంగా ఉన్నానా? అంత కోరిక రేకెత్తించేట్టున్నానా....'' లేనవ్వు పెదిమలమీద నాట్యమాడుతుండగా అడిగింది.

రామం అయోమయంగా ఆమె వంక చూశాడు.

''మాట్లాడవేం?'' రెట్టించింది ప్రమీల.

''అవును, అలాగే ఉన్నావు.''

''ఎలా... కొంచెం వర్ణించవోయ్, నా పిచ్చీ!''

''ఏం వర్ణించాలి?''

''అదే, ఆ నాడంటివే, నా తమలపాకు పెదాలు నిన్ను ఆహ్వానిస్తుంటాయని... మరిచిపోయావా? ఇవ్వాళ కూడా అలాగే కనిపిస్తున్నానా...''

రామం మనస్సు పుంజుకుంటూంది. తన మిత్రుడప్పుడప్పుడనే మాటలు గుర్తుకు వచ్చాయి. 'తన మొదటి ప్రియుణ్ణి జీవితాంతం మరిచిపోలేదుట ఆడది... బహుశః ప్రమీల తన మీది ఆశలు చంపుకోలేదు కాబోలు. అవును, తననెలా మరిచిపోగలదు?'

''అవును, ప్రమీ!.... అప్పటికంటే బావున్నావు. అప్పుడు అరవిచ్చిన మొగ్గవు. ఇప్పుడు పూర్ణవికసిత మందారానివి.''

''అవునా... అప్పటంతటి కోర్కె ఉందా నా మీద....'' గోముగా చూస్తూ అడిగింది ప్రమీల.

''ఆఁ నీ చహరాలో ఏం మార్పులేదు, ప్రమీ! ఓ క్షణం కోపం, మరుక్షణం అనురాగం...''

''ఉండు ఉండు, చెప్పనీ.... అప్పుడే తొందరపడతావేం.... ఇప్పటికికూడా అప్పనంగా వస్తే అనుభవిద్దామని. నీకు బాధ్యతలక్కరలేదు... ఆ నాటికీ, ఈనాటికీ నీలో పెద్ద తేడా లేదు. అప్పుడు పెళ్లవకపోయినా నా శరీరం నీకు కావాలి. దానితో అనుభవం నీకు కావాలి.... నువ్వు పెళ్లిచేసుకుని ఆ ఆడదాని బాధ్యత స్వీకరించలేవు... ఎంత స్వార్థం! అసలు ఈ కాలంలో నీలాంటి జాతి ప్రబలిపోతోంది.''

రామం నిర్వాక్కయి చూస్తూంటే, నవ్వుతూ అన్నది.

''ఇవాళ బండిదిగిందాకా తప్పదులే నీకీ బాధ....నరకం... ఏం?''

''నీ ఇష్టమొచ్చినట్టువాగు... ఎంతసేపు చెప్పినా ఇదేగా... నువ్వో మహాపర్వతానివి...నేనో మరుగుజ్జును...''

''అప్పుడే ఏమయింది. హుబ్లీలో మా ఇంటికి రావూ? ఒక రోజు ఉండిపోదువుగాని...''

ఆమె ధైర్యానికి ఆశ్చర్యపోతున్నాడు. తన శత్రువునే తన ఇంటికి ఆహ్వానిస్తూంది.

ఎన్నో స్టేషన్లు గడిచిపోతున్నాయి. హాస్పెట, గదగ్... చాలా కాలానికి గాని హుబ్లీ వచ్చినట్లనిపించలేదు.

ఈ లోపల పిల్లవాడు లేచి ఏడిస్తే వాణ్ణి సముదాయించటంలో పడిపోయింది ప్రమీల.

బండి ఆగటంతోనే, ప్రమీల భర్త కాబోలు, పెట్టెలన్నీ వెతుక్కుంటూ వచ్చాడు.

ప్రమీల సామాన్లు సర్ది లేచి నుంచుంది.

''వచ్చారా మీరు... ఉత్తరం అందిందో లేదో స్టేషనుకి వస్తారో లేదో అనుకుంటున్నాను.... ఈయన మరుగుజ్జు రామంగారు, బి.ఇ.. ఆఁ ఇంజనీరుగారని చెప్పలేదటండీ... మీమతిమరుపు పాడుగాను.... ఆఁ అదే నా ప్రేమలేఖలన్నీ మీకు చూపిస్తానంటున్నాడు... అయ్యో ఆహ్వానించరేం మన ఇంటికి...''

అతను రామం దగ్గిరగా వచ్చి, ''రండి... ఐయామ్ గ్లాడ్ టు మీట్ యు. దోవంతా మీ బుర్ర చెడగొట్టి ఉంటుంది. ఏమనుకోకండి....'' అన్నాడు.

''లేదు ... క్షమించండి... నాకు వెంటనే బండి ఉంది. మళ్లీ సెలవులేదుకూడా... రేపు జాయినయిపోవాలి.''

పెట్టెదిగి ప్రమీల వంక చూడకుండా గబగబా వెళ్లిపోయాడు అసమర్థుడైన రామం. వెళ్లిపోతున్న మరుగుజ్జువేపు మహాపర్వతంలా అలా చూస్తూ ఉండిపోయింది ప్రమీల.

ఆంధ్రప్రభ' సచిత్ర వారపత్రిక

26-11-1969


**ANNAPOORNA**

MARKETING SERVICES

120A, Bapuji Nagar, HMT Nagar, Nacharam

HYDERABAD - 500 076

TELEFAX : 715 4245